క్లుప్తంగా

'జంగా' ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు



జనగామ: రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బుధవారం జనగామ నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మున్సిపల్, మార్కెట్ మాజీ చైర్మన్లు ఎర్రమల్ల సుధాకర్, వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్, టీపీసీసీ సెక్రెటరీ కంచె రాములు హైదరాబాద్ పరిశ్రమల శాఖ కేంద్ర కార్యాలయంలో జంగాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని కలిసి సన్మానించారు. కాగా, ధర్మగోవర్ధన్‌రెడ్డి, చింతకింది మల్లేశం, గుండ శ్రీధర్‌రెడ్డి, ఉమాపతిరెడ్డి, కొత్త కరుణాకర్‌రెడ్డి తదితరులు జంగా రాఘవరెడ్డిని కలిసి సత్కరించారు.

చైర్మన్‌ను కలిసిన మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి

లింగాలఘణపురం: రాష్ట్ర ఆయిల్ అండ్ సీడ్స్ అభివృద్ధి సంస్థ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు అనిల్‌కుమార్, ఆంజనేయులు ఉన్నారు. అదేవిధంగా దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యను దివ్యాంగుల మండల నాయకుడు చీటూరుకు చెందిన గద్దం అంజయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

రాఘవరెడ్డిని కలిసిన నాయకులు

జఫర్‌గఢ్: రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేసిన జంగా రాఘవరెడ్డిని మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కట్టా మనోజ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య, పారెడ్డి సత్యనారాయణరెడ్డి, సాంబరాజు తదితరులు ఉన్నారు.

సన్మానం..



దేవరుప్పుల: హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ పారిశ్రామిక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన జంగా రాఘవరెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. గతంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన జంగా రాఘవరెడ్డికి అనుబంధం ఉన్న పార్టీ అభిమానులు తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు రెడ్డి రాజుల రమేష్ ,మాసంపెల్లి మహేందర్, తోటకూరి రమేష్, కొడగాని సోమనర్సోజీ, యూత్ మండల అధ్యక్షుడు ఉప్పుల అనిల్, ఉప్పుల ప్రకాశ్, పత్తేపురపు శేఖర్, రుద్రోజు చారీ, గౌడిశాల శ్రీను భాస్కరాచారీ, నరేష్, క్రాంతి, శ్రీను, లొడంగి రాజు, కారుపోతుల సతీష్ తదితరులు ఉన్నారు.

శోభారాణిని కలిసిన..



జనగామ: రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేసిన బండ్రు శోభా రాణిని బుధవారం కాంగ్రెస్ నాయకులు ఆలేటి సిద్ధిరాములు, జామ మల్లేశం, సిద్దులు తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

'చంద్రబాబును విమర్శించే స్థాయి విజయశాంతికి లేదు'

స్టేషన్‌ఘన్‌పూర్: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విమర్శించే స్థాయి విజయశాంతి, జగ్గారెడ్డి, నిరంజన్‌రెడ్డికి లేదని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మోటం శ్రీనివాస్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడుపై మాజీ ఎంపీ విజయశాంతి, జగ్గారెడ్డి, నిరంజన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు గుగులోతు మోహన్‌నాయక్, బత్తిని అజయ్, శవ్వాల రమేష్, రమేశ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలలో కోతులు, పాముల బెడద

రఘునాథపల్లి: మండలంలోని జాఫర్‌గూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిత్యం కోతులు, పాముల బెడద నెలకొంది. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో అల్లుకుపోయిన చెట్లు, చెత్తా చెదారంతో కోతులు, పాములు సంచరిస్తున్నాయి. పాఠశాలలో మూత్రశాలలకు వెళ్లాలన్నా విద్యార్థులు భయం భయంగా కర్రలు చేత పట్టుకొని వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. పల్లె ప్రకృతి వనం అధ్వానంగా మారడంతో పాములు, కోతులు తరగతి గదిలోకి వస్తున్నాయని, అధికారులు పల్లె ప్రకృతి వనాన్ని మరో చోటికి తరలించాలని పాఠశాల హెచ్‌ఎం శాగ కైలాసం కోరారు.



చేతిలో కర్రలతో విద్యార్థులు

అంగడి వేలం వాయిదా



అంగడి వేలం నిర్వహిస్తున్న డీసీఓ రాజేందర్, ఎంపీఓ వెంకటేశ్వర్లు

రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే అంగడికి ప్రభుత్వం నిర్ణయించిన ఆఫ్‌సెట్ ప్రైజ్ రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు మండల ప్రత్యేకాధికారి, డీసీఓ రాజేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామ, మండల ప్రత్యేకాధికారి రాజేందర్, ఎంపీఓ వెంకటేశ్వర్లు సమక్షంలో పంచాయతీ కార్యదర్శి కవిత ఆధ్వర్యంలో ఓపెన్ టెండర్ నిర్వహించారు. అంగడిని దక్కించుకునేందుకు 16 మంది ఔత్సాహికులు పోటీ పడ్డారు. సీక్రెట్ టెండర్‌లో ప్రభుత్వ ఆఫ్‌సెట్ ప్రైజ్ రాకపోవడంతో బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులోను ఆఫ్‌సెట్ ప్రైజ్ రూ. 42,22,240 రాక పోవడంతో ఈ నెల 15వ తేదీకి అంగడి వేలం వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాలఘణపురం: మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న మూడు అసిస్టెంట్ కుక్ పోస్టులకు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులని, వీరికి నెలకు రూ.9,750లు వేతనం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు 13న 4 గంటలలోపు దరఖాస్తులను విద్యాలయంలో అందజేయాలని కోరారు.

పరామర్శ



కొడకండ్ల: ఏడునూతుల గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ వీరసోములు సోదరుడు మిట్టపెల్లి శేఖర్ గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బుధవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. సిందె రామోజీ, సతీష్‌గౌడ్, లింగయ్య ఉన్నారు.

టీఎస్‌కే తండాలో..

పాలకుర్తి: మండలంలోని టీఎస్‌కే తండా మాజీ సర్పంచ్ బాలు నాయక్ తల్లి మంగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, బుధవారం మాజీ మంత్రి దయాకర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పసునూరి నవీన్, శ్రీనివాస్ ఉన్నారు.

కేసు కొట్టివేత

చిల్పూరు : భార్య ఆత్మహత్య కేసులో రెండేళ్ల ముద్దాయిగా ఉన్న గొల్లపల్లి స్వామిపై నమోదైన కేసును బుధవారం సెషన్స్ జడ్జి విక్రమ్ కొట్టివేశారు. అబ్దుల్‌నాగారం గ్రామానికి చెందిన గొల్లపల్లి స్వామి, చిల్పూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కొట్టె సుజాతను వివాహం చేసుకున్నాడు. అయితే 2002లో ఇద్దరి మధ్య గొడవల కారణంగా సౌందర్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో మృతురాలి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి కోర్టులో నిందితుడి తరపున చీఫ్ డిఫెన్స్ లాయర్ మంచాల రవీందర్ వాదిస్తున్నారు. చివరికి మృతురాలి పెద్ద కుమారుడు సందీప్ ఇచ్చిన సాక్ష్యంతో జడ్జి కేసును కొట్టివేశారు. ఈ కేసులో స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వెంకన్న సాక్షులను ప్రవేశపెట్టారు.

వన మహోత్సవ ఏర్పాట్ల పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 12న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వన మహోత్సవం కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపడుతుందని, అందరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. 12న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే కార్యక్రమానికి అతిథులుగా ఎంపీ డాక్టర్ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్, ఈజీఎస్ ఏపీఓ ప్రేమయ్య పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకన్న

ఉద్యమ స్ఫూర్తి స్తూపం నిర్మాణానికి విరాళం



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

బచ్చన్నపేట: జిల్లా కేంద్రం బతుకమ్మకుంటలో ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన ఉద్యమ స్ఫూర్తి స్తూప నిర్మాణానికి తెలంగాణ జయశంకర్ సేవాసమితి కమిటీ చైర్మన్ కొత్తపల్లి సతీశ్ రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమ స్ఫూర్తి వాల్‌పోస్టర్‌ను కమిటీ సభ్యులతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ కరోనా సమయంలో వందల మందికి నిత్యావసర సరుకులను అందించిన సతీశ్ సేవాతత్పరుడని, ప్రజా సేవలో ముందుండే ఆయన అభినందనీయుడని అన్నారు. మంగళంపల్లి రాజు, కౌశిక్, అజయ్, నీల రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన ఘన్‌పూర్‌లో నేడు(గురువారం) చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని రజకసంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు ఘన్‌పూర్ రజక సంఘం అధ్యక్షుడు పొన్న ఉపేందర్ అన్నారు. ఘన్‌పూర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు ఉదయం 11 గంటలకు చేపట్టనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరవుతున్నారని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పొన్న రవి, పొన్న సత్యనారాయణ, పొన్న శ్రీనివాస్, రమేష్, రాజశేఖర్, రవి, చందు, గౌతమ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'పది' ప్రతిభావంతులకు ఆర్థికసాయం

దేవరుప్పుల: మండలంలోని కామారెడ్డి గూడెంలో హైస్కూల్‌లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థులకు పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గులాం రసూల్, మాజీ ఎంపీటీసీ జాకీర్ ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేంద్రకుమార్. లక్ష్మీనారాయణ, శోభారాణి, పి.అరుణ, అన్వర్ సుల్తానా, అమ్మ ఒడి బడి అధ్యక్షురాలు పులి పంపుల మమత, స్థానిక యువత చింత నిఖిల్,సాయి నేత, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సాయం అందుకున్న టాపర్లతో రసూల్, జాకీర్

యువకుడి ఆత్మహత్య

చిల్పూరు: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొండాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్, కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోతె రాజు (38), అతని భార్య రమలు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇటీవల రాజు అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అవితీర్చే మార్గం కనిపించక మద్యానికి బానిసై కూలీ చేసిన డబ్బులు కూడా ఇంట్లో ఇవ్వడం మానేశాడు. దీంతో ఇటీవల భార్య, భర్తల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. కాగా, బుధవారం మల్కాపూర్ గ్రామంలో కూలీ పనులకు వెళ్లిన ఇద్దరు గొడవ పడ్డారు. దీంతో ఇప్పుడే వస్తానంటూ వెళ్లిన రాజు విషగుళికలు మింగి కింద పడి పోయాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా 108 అంబులెన్స్ వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



రాజు(ఫైల్)

కంకరకే పరిమితమైన రోడ్డు

- 8 నెలలవుతున్నా బీటీకి నోచుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న తండావాసులు

జఫర్‌గఢ్: మండలంలోని తీగారం గ్రామ శివారు హనుమాన్‌తండా రోడ్డుపై కంకరపోసి వదిలేయడంతో తండావాసులు ఇబ్బంది పడుతున్నారు. తండావాసుల సౌకర్యార్థం గత ప్రభుత్వం తీగారం ప్రధాన రహదారిని ఆనుకుని హనుమాన్‌తండా వరకూ 3 కిలోమీటర్లు బీటీ రోడ్డును మంజూరు చేయడం జరిగింది. ఇట్టి పనులను సదరు కాంట్రాక్టర్ వెంటనే ప్రారంభించి రోడ్డు పొడవునా కంకరపోశాడు. అనంతరం బీటీ వేయాల్సి ఉండగా 8 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో నిత్యం రోడ్డు మీదుగా ప్రయాణించే తండావాసులు నానా అవస్థలు పడుతున్నారు. కనీసం కాలినడకన కూడా వెళ్లలేని దుస్థితి నెలకొందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు సంబంధిత కాంట్రాక్టర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదంటు వాపోయారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి ఇబ్బందులు తొలగించాలని తండావాసులు కోరుతున్నారు.



కంకరపోసి వదిలేసిన హనుమాన్‌తండా రోడ్డు

ఎమ్మెల్యే స్పందించాలి..



హనుమాన్‌తండా రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డుపై కంకరపోసి 8 నెలలవుతున్నా బీటీ వేయకుండా సదరు కాంట్రాక్టర్ వదిలేశాడు. విషయాన్ని తండావాసులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. దీనిపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి రోడ్డును బీటీగా మార్పించి తండావాసుల ఇబ్బందులు తొలిగించాలి.

\- రాథోడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యారంగ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం పిలుపునిచ్చారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు రూ.7,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాలకులు ఎన్నికల ముందు చేసిన హామీలను విస్మరిస్తూ విద్యారంగ సమస్యల్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. విద్యారంగ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యాకన్నరాథోడ్, ఆర్య, హిందూ, దివ్య, లహరి, అపర్ణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మభిక్షం

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న డీడబ్ల్యూఓ జయంతి

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని 1,2,3,4 అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం డీడబ్ల్యూఓ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పిల్లలకు ప్రీస్కూల్ షెడ్యూల్, కేంద్రాల్లో పిల్లలకు అందించే ఆహారం, మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా తదితర వివరాలు తెలుసుకున్నారు. రికార్డుల్లో ప్రకారం పిల్లలు బరువు ఉన్నారో లేదో చూశారు. ఆరోగ్య లక్ష్మి మదర్స్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు తింటున్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ దూలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు మంతెన విజయరాణి, అన్నం రోజారమణి, నామోజు జ్యోతి, కర్ణకంటి వాణిస్వర్ణవీణ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

బచ్చన్నపేట: విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. వనమహోత్సవం సందర్భంగా మండలంలోని నాగిరెడ్డిపల్లిలో మొక్కలు నాటిన ఆయన మాట్లాడారు. గ్రామాల్లో, రోడ్లవెంట, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, సాగుకు యోగ్యంగా లేని ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. పల్లెలన్నీ హరితవనాలుగా వృద్ధిచెందాలని, అధికారులు, రైతులు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు ఆ దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, జీపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట: మొక్క నాటుతున్న ఎంపీడీఓ

లూయిస్ డాగురేకు ఘన నివాళి



లూయిస్ డాగురేకు నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

పాలకుర్తి: కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే వర్ధంతిని బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండేలా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫొటో మండల గ్రాఫర్స్ అధ్యక్షుడు రాపోలు రాము, జిల్లా నాయకుడు పట్టూరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు ఎడవెల్లి వెంకన్న, కార్యదర్శి గజ్జి రాజు, ఉపాధ్యక్షుడు నాని, అశోక్, బాబు, రాపోలు లక్ష్మణ్, ప్రదీప్, రమణ; సురేష్, మధులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

- కాంట్రాక్టర్, డ్రైవర్‌పై కేసు నమోదు

జనగామ:జనగామ మండలం చీటకోడూరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్తులు, సీఐ రఘుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యశ్వంతాపూర్ వాగుపై ఫేస్-2 ద్వారా నిర్మాణం చేస్తున్న చెక్‌డ్యాం పనుల కోసం నంబర్ లేని టిప్పర్‌లో ఇసుకను తరలిస్తున్న క్రమంలో చీటకోడూరుకు చెందిన రావుల రఘు, గ్రామస్తులు పట్టుకున్నారు. టిప్పర్‌ను అడ్డుకున్న గ్రామస్తులను, రఘు ద్విచక్రవాహనంపై దూసుకు వస్తూ చంపేందుకు సైతం ప్రయత్నించడంతో తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు వారు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వాగు నుంచి ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునే వారిపై బెదిరింపులకు దిగుతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. చీటకోడూరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా టిప్పర్‌తో పాటు డ్రైవర్‌ను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డితో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

'భూసమస్య పేరిట రక్తసంబంధాన్ని విస్మరించొద్దు'

దేవరుప్పుల: రక్తం పంచుకొని జన్మించిన అన్నదమ్ములు భూసమస్యల పేరిట తమ బంధాన్ని విస్మరించవద్దని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని కోలుకొండ ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహించిన ఆయన పెద్దతండాలో నెలకొన్న ఓ కుటుంబ భూతగాదా విషయమై గ్రామస్తుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి పలు సూచనలు చేశారు. తండాకు చెందిన గుగులోత్ భోజ్యా, తేజా, రామ్ సింగ్‌లకు వారసత్వంగా పొందాల్సిన తండ్రి భూమి ఒక్కరే చేసుకోవడంతో వివాదం నెలకొంది. దీంతో ఇరువురు వ్యవసాయ భూమిసాగు పనులకు విఘాతం కల్పించుకుంటా స్టేషన్‌కు చేరారు. ఈ విషయమై పోలీసులు తండాకు చేరి సామరస్యంగా పరిష్కరించుకోవాల్సింది పోయి భూసమస్య పేరిట అన్నదమ్ములు కక్షలు పెంచుకోవద్దని, గ్రామ పెద్దలు వాస్తవిక విషయమై తగు సూచనలు చేస్తే న్యాయసమ్మతం జరిగేలా పోలీసు యంత్రాంగం తోడ్పాటు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్, కానిస్టేబుల్ మసూద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.